www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 7 జనవరి 2025
5
వైఎస్ఆర్

పారిశుధ్య కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

26వ డివిజన్, మాసాపేటలో ఉన్న పారిశుధ్య కార్మికులకు స్థానికంగా మరుగుదొడ్లలను, ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మసాపేట శివ, ఎన్ఆర్ఐ మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్. రహమతుల్లా కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కార్పొరేషన్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. నిత్యం కడప నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం కాపాడే బాధ్యత అధికారులకు, కూటమి ప్రభుత్వానికి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌సి సెల్ నగర ఉపాధ్యక్షుడు వంకేల ఆనంద్‌రావు, దాసరి ప్రభాకర్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు లోకేష్ కుమార్, నగర అధ్యక్షులు అనిల్, కడప పార్లమెంట్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ విశ్వనాథ్, యువత నారాయణ, రాఘవ పాల్గొన్నారు.

ఆర్‌టిసి అద్దె బస్సు డ్రైవర్ల నిరసన

- ఉదయం నుంచి ఆగిన 27 బస్సులు
- రెగ్యులర్ డ్రైవర్లతో సమానంగా నిబంధనలు వర్తింపజేయాలని డిమాండ్

ఆర్‌టిసి డిపో వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లు

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

రెగ్యులర్ డ్రైవర్లతో సమానంగా తమకూ నియమ నిబంధనలు వర్తింపజేయాలని సోమవారం పులివెందుల ఆర్‌టిసి అద్దెబస్సు డ్రైవర్లు డిపో కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. తెల్లవారుజామున నుంచి 30 మంది అద్దె బస్సు డ్రైవర్లు ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ 'డిఎం డౌన్ డౌన్ 'అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అద్దె బస్సు డ్రైవర్లు మాట్లాడుతూ కోర్టు ఆదేశాల మేరకు 30 ఎంజి లోపు వచ్చిన వారిని సస్పెండ్ చేయకూడదని ఆంక్షలు ఉన్నాయని అంటున్నారు. ఈ నియమాలను పులివెందుల డిపో పరిధిలో పాటించకుండా 18 శాతం రావడంతోనే సస్పెండ్ చేశారన్నారు. ఈ కారణం చేత పులివెందుల డిపో పరిధిలో రెండు సంవత్సరాలలో 30 మంది అద్దె డ్రైవర్లను సస్పెండ్ చేశారని వాపోయారు. సస్పెండ్ చేస్తూ వెళ్తే డ్రైవర్ల కుటుంబాలు ఎలా బతుకుతాయి అని అన్నారు. 2024 డిసెంబర్ 31న రామాంజనేయులు అనే అద్దె బస్సు డ్రైవర్‌కు మద్యం పరీక్షలు 18 శాతం రావడంతో అతనిని సస్పెండ్ చేశారన్నారు. ఆర్‌టిసిలో ఉన్న డ్రైవర్లకు మాత్రం ఈ విధంగా మద్యం శాతం వస్తే క్రమశిక్షణ చర్య లు తీసుకుని ఏడాదిలో అనుమతిస్తున్నారని చెప్పారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను కూడా అదే విధంగా చూడాలి కోరారు. అనుభవం లేని డ్రైవర్ల ద్వారా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నారని అనుభవం ఉన్న డ్రైవర్లు చిన్న తప్పులను క్షమించి వారిని మళ్లీ విధుల్లోకి యాజమాన్యం తీసుకోవాలని వారు కోరారు. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే ఉదయం ఐదు గంటల నుంచి నిరసన చేస్తున్నారని డిఎం పేర్కొన్నారు. ఈ నిరస నకు ముఖ్య కారణం డిసెంబర్ 31న రాత్రి ఒక డ్రైవర్ మద్యం సేవించి రావడంతో ఆల్కహాల్ పరీక్ష నిర్వహించగా అందులో 18 శాతం ఆల్కహాల్ శాతం రావడంతో అతన్ని విధుల నుంచి తొలగి ంచామని పేర్కొన్నారు. గతంలోనూ ఈ డ్రైవర్ మద్యం సేవించి రావడంతో అప్పుడు ఆల్కహాల్ పర్సంటేజ్ ఎక్కువ రావడంతో పక్కన పెట్టామని తెలిపారు. మొదటి తప్పుగా భావించి తిరిగి విధుల్లోకి తీసుకున్నామని పేర్కొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ఉద్యమ ప్రణాళిక

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లా సమగ్రాభివృద్ధికి సిపిఎం కడప జిల్లా 12వ మహాసభలో తీర్మాణాలు చేసి ప్రణాళిక రూపొందించామని నూతనంగా ఎన్నికైన సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12వ జిల్లా మహాసభలు మొదటి రోజు వేలాది మందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నగరంలో నిర్వహించామని తెలిపారు. వెనుకబడిన రాయలసీమ, కడప జిల్లా లాంటి ప్రాంతా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వాలు పెద్ద ఎత్తున నిధులు ఇచ్చి, ఖర్చు చేసి, శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. పరిశ్రమలు, ప్రాజెక్టులు, ఉపాధి అవకాశాలు ఏర్పాటుకు ప్రభుత్వాలు కృషి చేయాలని ఈ మహాసభలకు వచ్చిన ప్రతినిధులు చర్చించి భవిష్యత్తు కార్యచరణ రూపొందించామని చెప్పారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి, వివిధ మండలాలలో స్థానిక సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ నిధులు కేటాయింపునకు ప్రజా ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించాలని తీర్మాణాలు చేసినట్టు తెలిపారు. కడప ఉక్కు ఆంధ్రుల హక్కుగా జిల్లా వ్యాప్త ఉద్యమంగా నిర్వహించాలని, జిల్లాలో విస్తృతంగా ఉన్న నాపరాయి ముడి ఖనిజం ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అపారంగా ఉన్న ఇనుప ఖనిజం ఆధారంగా కడప ఉక్కు పరిశ్రమ నిర్మించాలని, కొప్పర్తి పారిశ్రామిక కేంద్రంలో ఇండస్ట్రియల్ కారిడార్ ప్రభుత్వ ప్రోత్సాహంతో అనేక రకాల పరిశ్రమలు రావడానికి ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఎంఎస్ఇఎం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను అమరావతికి తరలించకుండా ఆపాలన్నారు. బ్రహ్మసాగర్ లీకేజీల నివారణకు కాంక్రీట్ వాల్ నిర్మించాలని, వెలిగొండ, వామికొండ, సర్వాయి సాగర్, రాజోలు ప్రాజెక్టుల నిర్మాణం కింద ఉన్న పంట కాలాల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్న చేనేత కార్మికుల సంక్షేమానికి, గొర్ల పెంపకం దార్ల సంక్షేమానికి, చేతి వృత్తిదారుల సంక్షేమానికి ప్రభుత్వ సహాయ సహకారాలు, నిధులు అందించాలన్నారు. జిల్లాలో వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున వలస వెళుతున్నారని, వారికి స్థానికంగానే ఉపాధి హామీ పథకం ఏడాదికి 200 రోజులు, రోజు కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కడప నగరం బుగ్గ వంక ఇరువైపులా ఉన్న కాంక్రీట్ వాల్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాలని, ప్రభుత్వ స్థలాల భూకబ్జాలను అరికట్టాలని కోరారు. ప్రొద్దుటూరు పట్టణ తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవటానికి ప్రణాళిక రూపొందించాలన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శిగా చంద్రశేఖర్

16 మందితో నూతన కమిటీ

ప్రజాశక్తి-కడప అర్బన్

సిపిఎం కడప జిల్లా కార్యదర్శిగా జి.చంద్రశేఖర్ తిరిగి ఎన్నియ్యారు. కడపలోని సీతారాం ఏచూరి నగర్ (అజ్మత్ కల్యాణ మండపం)లో రెండు రోజుల పాటు జరిగిన సిపిఎం కడప జిల్లా 12వ మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకుని సోమవారం ప్రకటి ంచారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా ఎ.రామ్మోహన్, బి.మనోహర్, జి.శివ కుమార్, వి.అన్వేష్ ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా కె.శ్రీనివాసులరెడ్డి, బి.దస్తగిరిరెడ్డి, కె.శ్రీనివాసులు, పి.చాంద్‌బాషా, కె.సత్యనారాయణ, బి. లక్ష్మిదేవి, ఎస్.గౌసియాబేగం, బి.ఎల్.రాజన్న, బి.ఆర్.రాహుల్, మరో ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న విసి కృష్ణారెడ్డి

విద్యార్థికి విసి ప్రశంసలు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయం జియాలజీ శాఖ విద్యార్థి కె. ఇమ్మాన్యుయేల్‌కు ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఒఎన్‌జిసి) నుంచి మెరిట్ స్కాలర్ షిప్ మంజూరైంది. ఒఎన్‌జిసి మెరిట్ స్కాలర్ షిప్ కింద ఈ విద్యార్థికి ఉన్నత విద్య కొనసాగించేందుకు ఏడాదికి రూ.50 వేలు ఇవ్వనున్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన ఈ విద్యార్థి డిగ్రీలో 8.9, పీజీ మొదటి రెండు సెమిస్టర్‌లలో 9.0 జిపిఎ సాధించి ప్రతిభను చాటారు. ఈ ఉపకార వేతనానికి జాతీయ స్థాయిలో దాదాపు 2 వేల మంది దరఖాస్తు చేయగా ప్రతిభా ప్రాతిపదికన వైవీయూ క్యాంపస్ పీజీ కళాశాల జియాలజీ విదార్థి ఇమ్మాన్యుయేల్ ఎంపిక కావడం హర్షణీయమని వైవీయూ విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్త పద్మ , ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, భూగర్భశాస్త్ర విభాగాధిపతి వి. సునీత, ఆచార్య కె. రఘుబాబు, ఆచార్య ఎన్. జయరాజు, సహఆచార్యులు ఎస్. శ్రీనివాస్ గౌడ్, అకడమిక్ కన్సల్టెంట్లు అభినందించారు. నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఎన్.జి.ఆర్.ఐ) ఇంటర్న్‌షిప్‌కు దేశవ్యాప్తంగా 400 దరఖాస్తులను వడపోసి వైవీయూ జియాలజీ విద్యార్థులను ముగ్గురిని ఎంపిక చేసిన విషయాన్ని ఆ శాఖ విభాగాధిపతి ఆచార్య వి. సునీత అధికారుల దృష్టికి తెచ్చారు. . కార్యక్రమంలో ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ పి సరిత పాల్గొన్నారు.

కోడిపందేలు చట్టరీత్యా నేరం : జెసి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కోడి పందేలు నిర్వహించడం, పాల్గొనడం చట్ట రీతా నేరమని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో ప్రజా వినుతుల పరిష్కార వేదికలో 'కోడి పందేలు నిర్వహించుట - పాల్గొనుట చట్టరీత్యా నేరం' పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోడి పందేలు నిర్వహించినా, ప్రోత్సహించినా, పాల్గొన్నా జీవ జంతు సంరక్షణ చట్టం సెక్షన్ 34/1960, సెక్షన్ 10/1974 ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాయపూర్‌లో ఈనెల 2 నుంచి 6 వరకు నిర్వహించిన లికురాష్లి (కుస్తీ) 58వ స్కూల్ గేమ్స్ జాతీయస్థాయి పోటీలలో కడప క్రీడాకారులు రజిత పతాకాలు సాధించారు. అండర్-17 విభాగం 73 కిలోల పోటీలో బి.శ్రీశశాంక్ రజత పతకం సాధించాడు. అండర్-19 విభాగంలో 60 కిలోల పోటీలో నవాజ్ ఉర్ రెహమాన్ కాంస్య పతకం సాధించాడు. వీరి విజయం పట్ల కోచ్ వెంకటేష్, కడప జిల్లా అండర్ - 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ శారదా, సుబ్బరాజు అభినందనలు తెలిపారు.

క్రైస్తవుల పక్షపాతి సిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్ : క్రైస్తవ సమాధుల స్థలాల సేకరణ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు ఉత్తర్వుల జారీ చేయటంపై టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామి దాసు, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి వర ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ప్రభుత్వ విప్ మాధవి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి దాసు మాట్లాడుతూ క్రిస్టియన్ అని చెప్పుకునే జగన్ రెడ్డి చేయకలేకపోయిన పని సిఎం చంద్రబాబు చేశారన్నారు. ఇటీవల ముఖ్యమంత్రిని కలిసి క్రైస్తవ సమస్యలపై వినతిపత్రం అందజే శామని తెలిపారు. వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి ఉత్తర్వులు ఇవ్వడం హర్షణీయమన్నారు. రాబోవు రోజుల్లో క్రైస్తవులకు మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారని చెప్పారు. సమావేశంలో టిడి పాస్టర్ డేవిడ్, బండి విజయ్ కుమార్, టిడిపి క్రిస్టియన్ నాయకులు శామ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ

ప్రజాశక్తి-కడప అర్బన్ : కడప నగర శివారులోని డిటిసిలో నిర్వహిస్తున్న కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ ఆరో రోజు సోమవారం కొనసాగింది. అభ్యర్థులకు 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించారు. మొత్తం 600 మంది అభ్యర్థులకు గాను 406 మంది పరీక్షలకు హాజరయ్యారు. 247 మంది క్వాలిఫై అయ్యారు. అభ్యర్థులకు పిఎంటి, పిఇటి పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి బి.రమణయ్య, డిఎస్‌పిలు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఐటి కోర్ టీమ్, డిపిఒ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.దేహదారుఢ్య పరీక్షల్లో ఇప్పటి వరకు ఉమ్మడి కడప జిల్లాలో 4,492 మంది అభ్యర్థులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో అభ్యర్థులు

ఎసిఎ అండర్-12 అంతర్ జిల్లాల

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

- అనంతపురం జట్టుపై కడప విజయం

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియం, కెఒఆర్ఎం క్రికెట్ మైదానాలలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) అండర్ -12 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన ప్రారంభ మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై 31 పరుగుల తేడాతో కడప జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 35.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. ఆ జట్టులోని తాహిర్ 54 (నాటౌట్), విష్ణువర్ధన్ రెడ్డి 45, మానస్ నందన్ 31 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని లలిత్ కిషోర్ 3, హేమ చందర్ నాయక్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 167 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 29.2 ఓవర్లలో 135 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమిని చవిచూసింది. ఆ జట్టులోని హవిష్ రెడ్డి 45, గణేష్ 20 పరుగులు చేశారు. కడప జట్టులోని మోనిష్‌రెడ్డి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 4 వికెట్లు తీసుకున్నాడు. అబుబకర్, షాహిద్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.

కర్నూలుపై చిత్తూరు విజయం

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభ రోజు కర్నూలు, చిత్తూరు జట్లు తలపడ్డాయి. చిత్తూరు జట్టుకు చెందిన ధనుష్ సెంచరీ చేయడంతో చిత్తూరు జట్టు కర్నూలు జట్టుపై 165 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 35.0 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 250 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఎన్. ధనుష్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 94 బంతులను ఎదుర్కొని 15 బౌండరీల సహాయంతో 110 పరుగులు (సెంచరీ) చేశాడు. మరో బ్యాట్స్‌మెన్ లలిత్ ఇరగం రెడ్డి 99 పరుగులు చేశాడు. అనంతరం 251 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 22.2 ఓవర్లలో 85 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమిని చవిచూసింది. చిత్తూరు జట్టు లోని లలిత్ సాయి, గణేష్ చెరో మూడు వికెట్లు తీసుకున్నారు.

తలపడుతున్న అనంతపురం , కడప జట్లు

సబ్ జైల్‌ను సందర్శించిన జడ్జి

కేంద్ర కారాగారంలో రికార్డులు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - కడప

సీనియర్ సివిల్ జడ్జి జిల్లా ఎస్. బాబా ఫక్రుద్దీన్ సోమవారం కడప పురుషుల, మహిళల కేంద్ర కారాగారాలను ప్రిజం లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి వారి కేసు, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మానసిక వ్యాధిగ్రస్తులైన ఖైదీలతో మాట్లాడారు. సకాలంలో డాక్టర్ సలహాలు తీసుకుంటూ మందులు వాడాలని సూచించారు. అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్‌లను పరిశీలించి తగు సూచనలను సలహాలు ఇచ్చారు. ప్రిజం లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర కారాగారం సూపరింటెండెంట్లు, ఖైదీలు పాల్గొన్నారు.

పాత ఖైదీలు, తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఖైదీల ఆరోగ్యం మొదలగు అంశాలపై సోమవారం కడప జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో సీనియర్ సివిల్ జడ్జి జిల్లా కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత ఖైదీలు, తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఖైదీలు వారి అంశాల గురించి చర్చించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగంశాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

కన్న తండ్రే కామాంధుడు

- ఇద్దరు కూతుళ్లపై అత్యాచారం
- భర్త అఘాయిత్యంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

కామాంధుడు బోయకొండ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పేగు తెంచుకొని పుట్టిన కూతుళ్లను కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే కామాంధుడుగా మారి అత్యాచారానికి ఒడిగట్టాడు. అల్లారు ముద్దుగా పెంచి అందమైన జీవితాన్ని ఇవ్వాల్సిన తండ్రే తన ఇద్దరు ఆడపిల్లలుపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తండ్రి ఆగడాలను భరించలేక నొప్పి తాళలేక అమ్మమ్మ, మేనమామకు బాధను చెప్పుకున్నారు. మండలం కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజి గారిపల్లి శివాజీ నగర్‌లో ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శివాజీనగర్‌కు చెందిన బోయ కొండ (28), చిట్టెమ్మ (26) దంపతులకు ఐదుగురు సంతానం. కొడుకు పెద్దవాడు కాగా, మిగిలిన నలుగురు ఆడపిల్లలు. బోయకొండ చెట్లు కోసేందుకు, కూలి పనులు వెళుతుంటాడు. భార్య చిట్టెమ్మ గ్రా మాలు తిరుగుతూ గాజుల అమ్మేందుకు వెళుతుంది. ఈ క్రమంలో మద్యానికి అల వాటు పడ్డ కూలి చేసి సంపాదించిన డబ్బును తాగుడుకు ఖర్చు చేసేవాడు. భార్య గాజులు అమ్మేందుకు బయటకు వెళ్లడంతో మద్యం మత్తులో ఇంటి పట్టునే ఉంటున్న బోయకొండ కన్ను ఇంటిలో ఉంటున్న కూతుర్లపై పడింది. మూడో రోజుల క్రితం పెద్ద కుమార్తె(9)పై, మరుసటి రోజు రెండవ కుమార్తె(7)పై అఘాయి త్యానికి పాల్పడ్డాడు. మూడవరోజు తన ఏడేళ్ల కూతురిపై అఘాయిత్యానికి పాల్పడానికి తీసుకెళ్తుండగా, బోయకొండ అత్త గమనించి పాపను ఎక్కడ తీసుకెళ్తున్నావు అంటూ మందలించడంతో వదిలేశాడు. రెండు రోజులుగా పిల్లలు నొప్పి ఉందంటూ ఏడుస్తూ బాధను వారి అమ్మమ్మకు, మేనమామకు చెప్పుకొచ్చారు. వారు ఏమి జరిగిందని ఆరా తీస్తే అసలు విషయం బయటపడింది. తండ్రి చేసిన కృత్యాలను బిడ్డలు ఒక్కొక్కటిగా కడుపు తరుక్కు పోయిన అమ్మమ్మ, మేనమామ, తల్లి చిట్టెమ్మకు సమాచారం అందించారు. తల్లడిల్లిన కన్నపేగు బిడ్డల పరిస్థితిని చూసి చెల్లించిపోయింది. కన్న బిడ్డలపై అఘాయిత్యానికి పాల్పడుతున్న కీచక తండ్రిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు బోయకొండను పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. మదనపల్లి రూరల్ సర్కిల్ సిఐ రమేష్, స్థానిక పోలీసులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి బాధిత కుటుంబ సభ్యులను విచారించారు. ఘటనకు సంబంధించిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ విచారణలో కూతుళ్లపై తండ్రి లైంగిక దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో నిందితుడపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జాతీయ యూత్ ఫెస్ట్‌కు కడప అమ్మాయి

ప్రజాశక్తి - కడప అర్బన్

సయ్యద్ సానియా

జాతీయ యూత్ ఫెస్ట్‌కు కడప అమ్మాయి ఎంపికైనట్లు జిల్లా యువజన అధికారి మణికంఠ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ యూత్ ఫెస్టివల్ 2025 గాను నేషనల్ యూత్ పార్లమెంట్ 2024 అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థుల్లో 32 మంది విద్యార్థులను ఎంపిక చేశారని తెలిపారు. వారికి రెండు రౌండ్లల్లో పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు. అందులో నుంచి అన్ని రాష్ట్రాలను కలిపి10మంది పిల్లలను యాంకర్ లుగా ఎంపిక చేశారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తరపు నుంచి కడపకు చెందిన సయ్యద్ సానియా నేషనల్ యంగ్ లీడర్‌షిప్ డైలాగ్‌కి యాంకర్ గా ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈనెల 10 - 12 వరకు ఢిల్లీలో నిర్వహించబోయే నేషనల్ యంగ్ లీడర్ డైలాగ్ అనే కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవియా, ఇతర మంత్రులు కార్యక్రమానికి అధ్యక్షత వహించనున్నారాని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మన కడప అమ్మాయి ఎంపిక కావడం చాలా గర్వకారణమని పేర్కొన్నారు.

విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ రవీంద్రనాథ్

భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలి

ప్రజాశక్తి - కడప

భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి),కడప విద్యార్థులు జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ విద్యార్థులను అభినందించి, సర్టిఫికెట్లను బహుకరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, కామర్స్ అధ్యాపకులు డాక్టర్ మధుసూదన, డాక్టర్ నీలయ్య, డాక్టర్ అంకాల నాగరాజు, డాక్టర్ కృష్ణవేణి, రెడ్డి బాష, రాధిక, లావణ్య పాల్గొన్నారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం : జెసి

ప్రజాశక్తి - కడప : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)లో ప్రజల నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పని సరిగా పరిష్కరించాలన్నారు. కింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారినే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరి ంచారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర్ నాయుడు, జడ్‌పి సిఇఒ ఓబుల మ్మ, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి నాగేశ్వరరావు, ఎస్‌డిసిలు వెంకటపతి, శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

31వ రోజుకు చేరిన న్యాయవాదుల దీక్షలు

ప్రజాశక్తి - కడప : జీవో నంబర్ 145ను రద్దు చేసేంతవరకు ఉద్యమం ఆగదని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గురప్ప నాయుడు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ నంద్యాల చిన్నయ్య, న్యాయవాదులు హెచ్చరించారు. జీవో నంబరు 145 ను వెంటనే ఉపసంహరించుకోవాలని, తద్వారా ప్రజలకు మేలు చేయాలని ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కడప జిల్లా కోర్టు ఎదుట తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరి ష్కరించాలని కోరుతూ కడప బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ వాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 31వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కె. రామకొండయ్య, నంద్యాల చిన్నయ్య, మద న్మోహన్‌రెడ్డి, భువన ఏకాదశి రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, పటాన్ సాదక్ అలీ ఖాన్, జి. శ్రీనివాసులు రెడ్డి, జీ.వి. శ్రీనివాసులు, ఆమంచి అరవిందు కూర్చున్నారు. కార్యక్రమంలో సీనియర్ జూనియర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

దీక్షల్లో నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

సురేష్‌నాయుడుతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

పనులను అడ్డుకున్న ప్రజలు

- పోట్లదుర్తిలో చోటుచేసుకున్న ఉద్రిక్తత

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో సోమవారం ఆలయ భూములపై రగడ చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ఎంపీ సీఎం రమేష్ నాయుడు స్వగ్రామమైన పోట్లదుర్తి గ్రామంలో పెద్దమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో పార్కు, వ్యాయామశాల నిర్మించేందుకు పనులు మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఆ పనులను కొందరు గ్రామస్తులు అడ్డగించారు. ఉత్సవాలు జరుపుకునేందుకు స్థలం తగ్గిపోతుందని గ్రామస్తులు వివరించారు. పనులు ఎలా ఆపుతారని సురేష్ నాయుడు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆర్‌డిఒ, తహశీల్దార్, పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. ప్రస్తుతం ప్రహరీ మాత్రమే కట్టుకోవాలని ఆర్‌డిఒ ఆదేశాలిచ్చారు.

మాట్లాడుతున్న రాచమల్లు

'వరద'వి పొంతనలేని మాటలు : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాటలకు అధికారంలోకొచ్చాక వ్యవహరిస్తున్న తీరుకు పొంతన లేదని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాదరెడ్డి తెలిపారు. తన ఇంట్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తనపై మట్కా, గుట్కా, బియ్యం అక్రమ రవాణా, ఇసుక దందా, మద్యం ఇలా అవాస్తవమైన ఆరోపణలు చేశారని, వీటిని తాను అధికారంలోకొచ్చాక ఉక్కు పాదంతో అణచివేస్తానని ఉత్తర ప్రగల్బాలు పలికారని తెలిపారు. ప్రజల్ని మోసం చేశారని తీవ్రంగా విమర్శించారు. ఆయనలా తాను అబద్దపు విమర్శలు చేయడం లేదన్నారు. వీటిలో వరదకు ప్రత్యక్ష సంబంధం లేకపోయినా వాటిని నియంత్రించకపోవడం రాజకీయ ప్రయోజనాల కోసమా.. ఆదాయ వనరులను ఏర్పాటు చేసుకోవడం కోసమా అని సూటిగా ప్రశ్నించారు. ఈ అనైతిక కార్యక్రమాలతో తనకు అప్పటికీ సంబంధంలేదని తన అన్న చేసే రియల్ ఎస్టేట్ వ్యాపారమే తన ఆర్థిక బలం అన్నారు. ప్రవీణ్ కుమార్‌రెడ్డి చేసిన కష్టానికి వరదకు ఫలితం దక్కిందన్నారు. తన హయాంలో భ్రష్టుపట్టిన ప్రొద్దుటూరును టిడిపి ప్రభుత్వం వస్తే సిరిపురాన్ని మంచిపురిగా తయారు చేస్తానని నమ్మబలికి ప్రవీణ్ మరిప్పుడు జరుగుతున్న అనైతిక కార్యక్రమాల గురించి ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. భవిష్యత్తులో తనకు రాజకీయ ప్రత్యర్థిగా ఉండాలంటే వరద అనైతిక చర్యలపై ప్రశ్నించాలన్నారు. నేడు వరద పక్కనున్న కౌన్సిలర్ మునీర్ మట్కా కేసులో ఉన్నాడన్నారు. అక్రమ బియ్యం వ్యాపారం నేటికి ప్రొద్దటూరులో యథేచ్ఛగా సాగుతోందన్నారు. నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో టిడిపి వర్గీయులు బెల్ట్ షాపులు నిర్వస్తున్నారన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన నలుగురు గోవా మందును తెచ్చి అక్రమంగా అమ్ముతున్నారన్నారు. జార్జిక్లబ్‌లో శనివారం నుంచి నగదు పెట్టి జూదం ఆడుతున్నారని ఆరోపణలు చేశారు. అక్రమ ఇసుక గురించి రామాపురంలో వరద అనుచరులే ప్రధానపాత్ర పోషించారని, వీరిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమొదైందన్నారు. గుట్కా వ్యాపారం యథేచ్ఛగా సాగుతోందన్నారు. వరదరాజులరెడ్డి అనుచరుడు ఒక కౌన్సిలర్ క్యాషినోకు గోవా ట్రిప్పు నిర్వహిస్తున్నాడని, దీనికి రూ.కోట్లల్లో కమీషన్ ఉంటుందని ఆడినవారు క్షవరం కావలిసిందే అన్నారు. అన్ని అనైతిక కార్యక్రమాలు జరుగుతున్నప్పటికీ ఎందుకు వరదరాజులరెడ్డి మౌనం వహిస్తున్నారో ప్రజలకు చెప్పాలని రాచమల్లు సూటిగా ప్రశ్నించారు.

వరికోత యంత్రాలు మిగిల్చిన గాట్లు

ప్రజాశక్తి - చాపాడు

వరి పంట సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వరి పంటను బురదలోనే యంత్రాల ద్వారా నూర్పిడి చేపట్టడంతో పొలాలు ఇలా తయారయ్యాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వీటిని చదును చేసుకునేందుకు వారు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రత్యేకంగా ట్రిల్లర్, దుక్కిళ్లు చేయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ ఏడాది వరుస తుఫానులతో వరి పంట నూర్పిడి చేసేందుకు ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో రైతులు చైన్ల మిషన్ల ద్వారా నూర్పిడి చేపట్టారు. ఖరీఫ్ సీజన్ వరి నూర్పిడి అనంతరం సాధారణంగా నూగు, దోస, మినుము, పెసర పంటలను సాగు చేయాల్సి ఉంది. ప్రస్తుతం వరి కోత యంత్రాల ద్వారా ఏర్పడిన గాట్ల వల్ల సాధారణ దుక్కిళ్లతో పంటల సాగు సాధ్యపడదు. పంట పొలాలకు అధికంగా నీరు పెట్టి ట్రిల్లర్, గేజీ వీల్స్‌తో సేద్యం చేయాల్సి ఉంది. ప్రస్తుతం కెసి కాలువకు నీరు వస్తుండడంతో రైతులు రెండవకారుగా వరి సాగుకు సిద్ధమవుతున్నారు. సాధారణ ఆరుతడి పంటలు సాగు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడితే ఈ గాట్లు ఇబ్బందికరంగా తయారైనాయి. పంట పొలాలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారయ్యాయి. వీటిని తొలగించుకునేందుకు రైతులకు ఆర్థికభారం తప్పడంలేదు. రెండు,మూడు సార్లు దుక్కిళ్ళు చేస్తే తప్ప వరి కోత యంత్రాల ద్వారా ఏర్పడిన గుంతలు తొలగించుకునే పరిస్థితి లేదు. రైతులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడంలేదు.

వివి కొట్టాల వద్ద వరి కోత యంత్రాలతో ఏర్పడిన గాట్లు

అంధత్వాన్ని జయించి.. ఆత్మవిశ్వాసంతో నిలిచి

పుట్టుకతోనే అంధురాలు.. భర్త, తల్లిదండ్రులు లేరు.. వారున్నంత వరకు ఆమెకు ఆదరణ ఉండేది.. ఎనిమిదేళ్ల క్రితం భర్త దూరమయ్యాడు.. ఆమె జీవితం మరింత అంధకారంగా మారింది.. ఏమి చేయాలో తెలియని పరిస్థితి.. ఈ నేపథ్యంలో ఆమెకు వచ్చిన ఒక ఆలోచన తన జీవన మనుగడకు దారి చూపింది. అదే అల్లికలు.. తన స్నేహితురాలి వద్ద 20రోజులు శిక్షణ తీసుకుని తన కాళ్లమీద తాను నిలబడింది. అన్నీవున్నా నిరాశతో ఉండే ఎందరికో స్ఫూర్తి కట్టా అనంతమ్మ.

ప్రజాశక్తి - లింగాల

సాధించాలనే పట్టుదల, కృషి, సంకల్పం ఉంటే సాటిలేరని ఓ అంధురాలు నిరూపిస్తోంది. తన జీవన ప్రయాణంలో అడుగులు వేయాల్సిన భర్త అకాల మరణంతో కుటుంబం పోషణకు ఆమె చేతి వృత్తిని ఎంచుకుంది. అంధురాలు కావడంతో రంగుల ప్రపంచాన్ని చూడలేకపోయినా జీవన మనుగడ కోసం దృఢసంకల్పంతో తన స్నేహితురాలు వద్ద చేతి వృత్తి శిక్షణ తీసుకొని, తన జీవన శైలిని మార్చుకుంది. ఈ క్రమంలో ఆ అంధురాలు తోటి మహిళలు, అంధులకు స్ఫూర్తిగా నిలుస్తోంది కట్టా అనంతమ్మ. ఆమె స్వస్థలం పులివెందుల నియోజకవరంగలోని లింగాల మండలం అక్కులగారిపల్లె. అక్కులుగారిపల్లె గ్రామనికి చెందిన కట్టా మద్దిలేటి, సుంకులమ్మ కుమార్తె అనంతమ్మ ఆమె వయసు ప్రస్తుతం 52ఏళ్లు. అనంతమ్మ పుట్టుకతోనే అంధురాలు కావడంతో ఇంటికే పరిమితమైంది. భర్త వెంకటేష్ ఎనిమిదేళ్ల క్రితం మరణించాడు. తల్లిదండ్రులు, కట్టుకున్న భర్త తనకు ఎవరూ తోడులేరు. ఆమెకు సంతానం కలగలేదు. ఈ పరిస్థితుల్లో ఆమె జీవితం దయనీయంగా మారింది. జీవన గమనంలో ఎన్నో అటుపోటుల నుంచి పెంచుకున్న కసితో ఇంటి గడప దాటి.. డోరు మ్యాట్లు, జంప్ పట్టలు తయారీని తన స్నేహితురాలి వద్ద ఇరవై రోజుల శిక్షణ తీసుకుంది. అనంతరం నేడు ఆమె తాను తయారు చేసిన వాటిని లింగాల మండలం పలు ప్రాంతాల్లో సరఫరా చేస్తోంది. వీటిద్వారా నెలకు రూ.2,500 నుంచి

తయారు చేసిన డోర్ మ్యాట్లు, తయారీలో నిమగ్నమైన అనంతమ్మ

రూ.4000 వరకు సంపాదిస్తోంది. తన కాళ్లపై నిలబడి తోటి మహిళలకు ఆదర్శంగా నిలిచి శభాష్ అనిపించుకుంటోంది అనంతమ్మ. అంధురాలైనప్పటికీ స్వశక్తిగా రాణిస్తూ.. అధికారుల ప్రోత్సాహంతో బ్యాంకుల నుంచి రూ.50వేలు రుణం పొందారు. ఆ డబ్బుతో అనంతరమ్మ మ్యాట్ల తయారీకి అవసరమయ్యే మెటీరియల్ కొనుగోలు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సాయం చేస్తే మరింత ముందడుగు వేస్తానని అంటోంది. ఆ మేరకు ప్రజాప్రతినిధులు స్పందించి ఆర్థికసాయం అందిస్తే అనంతమ్మ పలువురికి ఆదర్శంగా నిలవడంలో సందేహమే లేదు.

ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకుంటాం

మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని పురాణ ప్రసిద్ధి చెందిన శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మితమైన శ్రీరంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని సోమవారం శ్రీరంగనాథ స్వామిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆలయ పరిసరాలను పరిశీలించి ఇఒ వెంకటరమణను అడిగి పలు విషయాలు తెలుసుకున్నారు. ఆలయంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు, అవసరమైన ఇతర కార్యక్రమాల గురించి ఇఒ ఎమ్మెల్సీకి వివరించారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లపై ఇఒతో చర్చించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లి కృష్ణ రాజేష్ శర్మ, గిరిధర శర్మ వేదమంత్రాలు, పూర్ణకుంభంతో ఎమ్మెల్సీకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో గుప్తా మెడికల్ అధినేత మేడం దినేష్‌కుమార్, డాక్టర్ ఆర్ఎస్ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ శివశంకర్, శ్రీరంగనాథ ట్రస్ట్ సిఇఒ అల్లం రంగనాయకులు, టిడిపి నాయకులు టైలర్ శివారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ భూములను రీ సర్వే చేయించండి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని పాత కలమల్లలో ఉన్న శ్రీసిద్దేశ్వర స్వామి ఆలయ భూములపై రీ సర్వే చేయించి, దేవాలయ భూములను ఆలయానికి అప్పగించాలని ఆలయ కమిటీ నిర్వాహకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం వారు ఆలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ పాత కలమల్లలో పూర్వం రేనాటి చోళులు వంశానికి చెందిన ధనుంజయుడు ఇక్కడ శ్రీ సిద్దేశ్వరస్వామి ఆలయం, శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం నిర్మించారన్నారు. అప్పటి నుంచి తెలుగు శాసనాలు కూడా ఇక్కడ ఉన్నాయన్నారు. ఈ ఆలయం ప్రారంభంలో ఉన్న శ్రీసిద్దేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి సుమారు 63 ఎకరాల దేవాలయ భూమి ఉందన్నారు. ఆ భూమిని కొందరు ఈ సిద్దేశ్వర స్వామి ఆలయం పేరు పెట్టుకుని వచ్చే ఆదాయం తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా భూములపై రీ సర్వే చేసి పాత కలమల్ల సిద్ధిరస్తు సిద్దేశ్వర స్వామి ఆలయానికి అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. ఆలయ

మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు

అన్ని రకాల రికార్డులు ఉన్నాయన్నారు. ఈ భూములను వేరే ఆలయ భూములుగా మార్చి కొందరు అనుభవించుకుంటున్నారని తెలిపారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు, కలమల్ల గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రయాణికులకు దూరంగా ఆర్‌టిసి సేవలు

అధికారుల నిర్ణయాలతో ప్రయాణికుల ఆగ్రహం.. అవసరాల మేరకు నడపాలని వినతి

ప్రజాశక్తి - ఖాజీపేట

ఆంధ్రప్రదేశ్ రవాణా రంగంలో ఆర్‌టిసి సంస్థ అతిపెద్దది. ప్రతినిత్యం వివిధ మార్గాల్లో లక్షల మంది ప్రయాణికులు ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణిస్తూ ఉంటారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు కల్పించడమే సంస్థ ధ్యేయమంటూ.. ఆ సంస్థ అధికారులు గొప్పగా ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మాత్యులుగా ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధి ఉన్నా, ప్రయాణికుల సమస్యలు మాత్రం నెరవేరడం లేదు. ఆర్‌టిసి సంస్థ కేవలం లాభాలున్నా మార్గాలలోనే తమ సేవలను అందిస్తుంది తప్ప.. మిగతా మార్గాల్లో ప్రజల అవసరాలను ఏమాత్రం దృష్టిలో ఉంచుకోవడంలేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. ప్రయాణికుల అవసరాలకు తగిన విధంగా సర్వీసులు నడపడం లేదనే ఆరోపణలు ప్రయాణికుల నుంచి పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. బస్సు సర్వీసుల సేవలు పట్ల ప్రయాణికుల నిత్యం సమస్యలు ఎదుర్కొంటున్నా.. అధికారులు, సంబంధిత మంత్రి స్పందిస్తున్న దాఖలాలు అయితే లేవు. ఇప్పటికీ మారుమూల ప్రాంతాలకు బస్సు సర్వీసుల పట్ల ఆదరణ ఉంటున్నా, బస్సులు తిప్పడంలో అధికారులు శ్రద్ధ వహించడం లేదు. సంస్థలో అద్దె బస్సులు ప్రవేశించిన తర్వాత సంస్థ బస్సులు తగ్గిపోవడంతోపాటు కాలం చెల్లిన బస్సులు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. అద్దె బస్సుల ప్రవేశంతో ఆర్టీసీకి లాభాలు వస్తున్నాయని ఆ సంస్థ భావిస్తున్నా.. ప్రయాణికుల నుంచి అసహనం పెద్ద ఎత్తున వ్యక్తమవుతోంది. ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు స్టేజీల వద్ద చేయి ఎత్తుతున్నా ఆపకుండా వెళ్తున్నారన్న ఆరోపణలు ప్రయాణికుల నుంచి ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఆర్టీసీ ఉన్నత అధికారులు అడపాదడపా చర్యలు తీసుకుంటున్నారే తప్ప.. కఠిన చర్యలు మాత్రం చేపట్ట లేకపోతున్నారు. ఆర్టీసీ సంస్థలోని ఉన్నతాధికారులు కొందరు అద్దె బస్సు యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తూ చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తుంటారని మరికొందరి ఆరోపణ. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే తమ సంస్థ ధ్యేయమంటూ ఆర్టీసీ చెబుతున్న మాటలు ఆచరణలో కనిపించడం లేదని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఏదేమైనా ఆర్టీసీ అధికారుల అనాలోచిత నిర్ణయాలు, అద్దె బస్సు యజమానుల పట్ల ఉదాసీనత, రాజకీయ నాయకుల ఒత్తిళ్లు తదితర కారణాల వల్ల ఆర్టీసీ సంస్థను నష్టాల్లోకి వెళ్లేలా ఉంటున్నాయని చెప్పవచ్చు. బస్సుల సమయపాలన కూడా పాటించడం లేదన్న ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సు సర్వీసులు నడిపి, వారి ఆదరాభిమానాలు లభించినప్పుడే సంస్థ అభివృద్ధి చెందుతుందని ప్రయాణికులు తమ నిర్ణయాన్ని వ్యక్తపరుస్తున్నారు. మైదుకూరు, జమ్మలమడుగు డిపోల ఆర్టీసీ సంస్థ, అద్దె బస్సులు ఖాజీపేట బస్టాండులోనికి ప్రవేశించకుండానే బైపాస్ మీదుగా వెళుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ప్రయాణికులు బస్సు ఎక్కేటప్పుడు డ్రైవర్‌ను అడిగితే ఖాజీ పేటలో స్టాపింగ్ లేదంటూ సమాధానం ఇస్తున్నారని ప్రయాణికులు ఆరోపి స్తున్నారు. రాత్రులతోపాటు పగలు కూడా ఈ సమస్య ఉత్పన్నమవుతోంది.

రామేశ్వరం వరకు నడపాలి..

ప్రొద్దుటూరు డిపో సర్వీసులు రామేశ్వరం వరకు పొడిగించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. ఆస్పత్రికి వెళ్లే అవసరాలు, రోగుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని కడప-ప్రొద్దుటూరు మార్గంలో ప్రయాణించే ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను రామేశ్వరం వరకు పొడిగించాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు. వేంపల్లి, కమలాపురం, పులివెందుల ప్రాంతాల మీదుగా ప్రయాణించే బస్సులు గాంధీ రోడ్డు మార్గం ద్వారా అన్వర్ టాకీస్ హల్ వరకు నడిపితే ప్రయోజనకరంగా ఉంటుందని ప్రయాణికులు తమ అభిప్రాయాలను చెబుతున్నారు.

మైదుకూరు డిపో ప్రొద్దుటూరు-మైదుకూరు మార్గంలో ప్రయాణించే ఆర్డినరీ బస్సులు అల్లాడుపల్లి దేవలాలు మీదుగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ప్రొద్దుటూరు వెళ్లేందుకు బస్సు కోసం ప్రధాన రహదారిపైకి రావాలంటే ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుందని, తద్వారా అదనపు ఆర్థిక భారం భరించాల్సి వస్తుంది. మైదుకూరు డిపో అధికారులు దీనిపై ఆలోచించి సర్వీసులు నడపాలని ఆర్‌టిసి అధికారులను గ్రామీణ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు. మైదుకూరు-కడప మార్గంలో ప్రయాణించే మైదుకూరు డిపో బస్సులు కొత్త బస్టాండ్ వరకు పొడిగిస్తే ప్రయాణికులకు ప్రయోజనం ఉంటుందని, పాత బస్టాండుకు మాత్రమే అవకాశం ఉండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రొద్దుటూరులో ప్రయాణికులు కడప కెళ్లే బస్సు ఎక్కాలంటే మైదుకూరు రోడ్డులోని సుధా థియేటర్ వద్దకు వచ్చి ఎక్కాల్సి వస్తోంది. పాత బస్టాండు కూడలి వద్ద ప్రయాణికులు ఎక్కేలా అనుమతించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఆర్‌టిసి ఉన్నతాధికారుల స్పందించి ప్రయాణికుల అవసరాలు దృష్టిలో ఉంచుకొని తగిన మార్గాల్లో సర్వీసులు ప్రయాణికులకు అనుకూలంగా ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ ముకుందారెడ్డి

సమయపాలన తప్పక పాటించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

సచివాలయం సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపిడిఒ అలవలపాటి ముకుందారెడ్డి సూచించారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని సచివాలయాన్ని సోమవారం ఎంపిడిఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు, పని తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యుల వివరాలు మ్యాపింగ్ (హౌస్ హెూల్డ్ మ్యాపింగ్), పౌరులు (సిటిజన్), సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ)ల వివరాల సర్వే త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపిడిఇఒ హెచ్చరించారు. ఆలస్యంగా వచ్చి హాజరు వేసిన వారికి మెమో జారీ చేయాలని కార్యదర్శి నరసింహులుకు ఆయన ఆదేశాలిచ్చారు. ప్రజలకు అవసరమైన ఆధార్ సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మి నరసింహులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్

తేనెటీగల పరిశ్రమపై శిక్షణ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

తేనెటీగల పరిశ్రమపై శిక్షణా సదస్సులు నిర్వహించామని పులివెందుల ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు తెలిపారు. జువాలజీ డిపార్ట్మెంట్ విద్యార్థులకు సోమవారం తేనెటీగల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలు, పద్ధతుల గురించి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తేనెటీగల రకాలు, వాటిని ఉపయోగించే విధానాలు, తేనెను పరిశ్రమ ద్వారా ఎలా ఉత్పత్తి చేయవచ్చు, చెక్క బాక్స్‌లను ఉపయోగించి వాటిలో మేలు రకపు రాణి, కూలి, మగ తేనెటీగలను తీసుకొని ఉత్పత్తి చేయటం గురించి వివరించామన్నారు. తేనెటీగలు, తేనె ఉపయోగాల గురించి శిక్షణనిచ్చామన్నారు. జువాలజీ విద్యా ర్థుల్లో చాలా మందికి ఉపాధి కల్పించేలా శిక్షణ ఇచ్చామన్నారు. పాల్గొన్న విద్యా ర్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎల్.సుధీర, డాక్టర్ సి.బాల నారాయణ, కోర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ యు.శ్రీనిత, జనార్ధన పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - లింగాల

మండలంలోని మురారిచింతల ఫీడర్ పరిధిలో 33/11 కెవి నుంచి అంబకపల్లె సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా మంగళవారం, బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎఇ రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, ప్రజలు గమనించాలని, తమకు సహకరించాలని ఆయన కోరారు.

పలు గ్రామాల్లో నేడు..

తొండూరు : మండలంలోని గోటూరు, ఆగడూరు, సంతకొవ్వూరు, ఉడవగండ్ల, విద్యుత్ కేంద్రాల పరధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారి ఓబులేస్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ ఉండదన్నారు. ఈవిషయాన్ని రైతులు, ప్రజలు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

యువత సమస్యలపై పోరాటాలు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

యువత సమస్యలపై స్పందిస్తూ, వాటి పరిష్కార దిశగా డివైఎఫ్ఐ ముందుకు సాగాలని కోరుతున్నామని ఎస్ఆర్ఐటి కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి పేర్కొన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 2025 క్యాలెండర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివైఎఫ్ఐ యువజన సంఘం యువతను చైతన్య పరిచేలా ప్రతి ఏడాది క్యాలండర్ రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ మాట్లాడుతూ యూనియన్ నిరుద్యోగుల పక్షాన నిలబడి పోరాడుతూ ఉంటుందన్నారు. పోరాటాలే కాకుండా సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు వంటివి నిర్వహిస్తూ యువతను చైతన్య పరుస్తుమన్నామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, నాయకులు చంటి పాల్గొన్నారు.

సంజీవరెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న అభిమానులు

ఘనంగా సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - లింగాల

లింగాల టిడిపి మండల బాధ్యుడు దేవిరెడ్డి సంజీవరెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పులివెందులలోని తన నివాసంలో టిడిపి కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నీటి సంఘం మండల అధ్యక్షుడు దేవిరెడ్డి గురివిరెడ్డి, ఉపాధ్యక్షుడు చవ్వ కరుణ కుమార్‌రెడ్డి ఆయకు పూల బొకె అందించి శుభాకాంక్షలు తెలిపారు. సంజీవరెడ్డి అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆయన జన్మదిన సంబరాలను ఘనంగా నిర్వహించారు.

యునాని ఆస్పత్రిలో మందులు, సిబ్బంది కొరత

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక రాణివనంలో ఉన్న ప్రభుత్వాసుపత్రిలో యునాని మందుల కొరత రెండు నెలలుగా వేధిస్తోంది. సిబ్బంది కొరత కూడా ఉంది. రెండు నెలలుగా యునాని మం దులు రాకపోవడంతో దీర్ఘకాలిక (అలర్జీ, నొప్పులు) మందులు వాడే రోగులు ఇబ్బంది పడు తున్నారు. దీనిపై సోమవారం స్థానిక యునాని డాక్టర్ షహినా పర్వీన్‌ను అడగ్గా.. మందుల కొరత ఉందని తెలిపారు. ప్రతిరోజూ 20 మంది రోగులు గ్యాస్ ట్రబుల్, కీళ్ల నొప్పులు, అలర్జీ, ఫైల్స్ వంటి సమస్యలతో వస్తున్నారని వివ రిం చారు. సిస్టర్ సుధారాణి మెటర్నరీ లీవ్ ఉం ద న్నారు. ఎస్ఎన్ఒ పోస్టు ఖాళీగా ఉందని తెలి పారు. పిహెచ్‌సి డాక్టర్లు జ్యోత్స్న, ప్రియాంక మాట్లాడుతూ

అరకొరగా ఉన్న యునాని మందులు

గర్భిణులు స్థానికంగా కాన్పు చేయించుకోవడం మంచిదన్నారు. ప్రభుత్వా సుపత్రిలో నెలకు రెండు నుంచి నాలుగు వరకు కాన్పులను సహజం (నార్మల్ డెలివరీ)గా చేస్తు న్నామని తెలిపారు. అన్ని రకాల పరికరాలు ఉన్నాయని తెలిపారు. రోజుకు 120 మంది రోగులు ఆస్పత్రికి వస్తున్నారని తెలిపారు. విష పురుగులు, జంతువులు కాటేస్తే వాడే ఎఎస్‌వి, ఎఆర్‌వి తోపాటు అన్ని రకాల మందులు ఉన్నా యని వారు తెలిపారు. బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ బిల్డింగ్ నిర్మాణ పనులు దాదాపు పూర్త య్యాయని తెలిపారు. ఇక్కడ ల్యాబ్ టెస్టులు, సిబ్బంది సమావేశం భవనంగా విని యోగిం చుకునేందుకు వీలవుతుందన్నారు. వారానికి ఒకరోజు దంత వైద్యులు వస్తున్నారని తెలిపారు.

డాక్యుమెంట్స్ పోయినది

కడప తాలూక చెమ్ముమియాపేట గ్రామం, కాగితాల పెంట నివాసి యర్రపురెడ్డి రవీంద్రారెడ్డి భార్య వై.జయమ్మ కడప రిజిస్ట్రార్ ఆఫీసులో 69వ పుటలలో దస్తావేజు నంబరు 1534/1975గా రిజిష్టర్ కాబడిన లింకు డాక్యుమెంట్ పోయినది. ఎవరికైనా దొరికినయెడల సెల్ 9849530706, కె.శ్రీనివాసులురెడ్డికి ఫోన్ చేసి ఇవ్వగలరు.

CHANGE OF NAME

I, M.DEEKSHITHA REDDY, D/o M. SubbaReddy, #1/1248-1, Yerra mukkapalli, Near Sivalayam Colony, Kadapa District, AP-516004. do here by changed my Name as MEEGADA DEEKSHITHA REDDY & my father name as MEEGADA SUBBA REDDY(NEW NAME). Hence forth that now, I & my father may be called as MEEGADA DEEKSHITHA REDDY; MEEGADA SUBBA REDDY.

IN THE COURT OF THE HON'BLE ADDL. SENIOR CIVIL JUDGE, KADAPA
E.P.No. 45 Of 2024
In
O.S.No. 252 of 2018

Between:
U. Krishna Murthy son of U.Veeraiah aged 78 years, Hindu, Retired Govt. Employee, residing at D.No. 59/136, Nabikota Street, Kadapa City, Kadapa District. **...Decree Holder**

And

K.Vijayananda Babu son of K. Jojaiah aged about 45 years, working as a Govt. Teacher, at M.P.U.P, School, Kogatam village and Mandal, Kadapa District. **...Judgment Debtor**

NOTICE TO J.DR. UNDER ORDER 21 RULE 48 OF CPC

The above named D.Hr. filed the above E.P. for attachment of your salary in realization of E.P. amount. If you have got any objections, appear on 09-01-2025 at about 10.30 AM. Before the above named Hon'ble Court, failing which the matter will be decided as exparte.

//By Order of the Court//
M.V. BALI REDDY
Advocate, KADAPA.
Cell: 9440118269.